క్లుప్తంగా

ఇస్కఫ్ జిల్లా కార్యదర్శిగా మార్కండేయులు

డాబాగార్డెన్స్: భారత సాంస్కృతిక సహకర స్నేహ సంఘం (ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్, ఇస్కఫ్) విశాఖ జిల్లా కార్యదర్శిగా దేవరకొండ మార్కండేయులు ఎన్నికయ్యారు. ఇస్కఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దేవరకొండ మార్కండేయులును కార్యదర్శిగా, సహాయ కార్యదర్శులుగా జె. రాంప్రభు, పి. శ్యామసుందర్, కార్యవర్గ సభ్యులుగా వై. సత్యవతి, సీహెచ్ మధుబాబును ఎన్నుకున్నారు. ఇస్కఫ్ వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా కృషి చేస్తానన్నారు.

శిష్టకరణ సంఘం అభివృద్ధికి కృషి

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని ఏపీ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలిమహంతి ఉమామహేశ్వర రావు తెలిపారు. ప్రేమసమాజం సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఏపీ శిష్టకరణ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్‌లో మండల, జిల్లా సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, నిర్దిష్టమైన ఓటరు జాబితా తయారు చేసి ఎన్నికలు నిర్వహించేందుకు సమావేశం తీర్మానించిందన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి. జయబాబు, అడ్మిన్ కార్యదర్శి సదాశివుని పట్నాయక్, ప్రభాకరదాస్, పీవీటీ రమణారావు, సత్యప్రసాద్, పాత్రో, సుధాకర్, ఆర్‌వీ శర్మ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం



అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం చేస్తున్న పడాల గోవింద్

సీతమ్మధార : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్ గణపతి రెడ్డి కుటుంబానికి ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ చేతుల మీదగా ఆర్థిక సాయం చేశారు. సీతమ్మధారలోని శిరిడీ సాయి ఆటో స్టాండ్‌లో ఆటో నడుపుతున్న గణపతి రెడ్డికి షుగర్ ఎక్కువ కావడంతో ఒక కన్ను తీసేశారు. మరో కన్ను కనిపించకపోవడంతో ఆర్థిక సాయం అందించినట్లు గోవింద్ తెలిపారు. అవసరమైన నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో లంక గోవింద్, అప్పలనాయుడు, ఎ.శ్రీను, నాయుడు, సోములు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న మినీ వ్యాన్



పడిపోయిన విద్యుత్ స్తంభం

మర్రిపాలెం : కంచరపాలెం మెట్టు నుంచి జ్ఞానాపురం కాన్వెంట్ జంక్షన్ వైపుగా వెళ్తున్న మినీ వ్యాన్ ఒకటి అదుపు తప్పి ఆదివారం ఉదయం కంచరపాలెం వంతెనపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే ప్రమాద సమయంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి చేరుకుని పరిస్థితిని సమీక్షించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నిరాశ్రయుల కేంద్రంలో వైద్య శిబిరం

విశాఖ విద్య: బుచ్చిరాజు పాలెంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ఆదివారం ఉదయం రాబిన్ హుడ్ ఆర్మీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిరాశ్రయులకు బి.పి, షుగర్ పరీక్షలు చేశారు. మెడికల్ అధికారి ఎన్. మానస వృద్ధుల ఆరోగ్యస్థితుగతులను అడిగి తెలుసుకొని అవసరమైన మందులు సిఫార్సు చేశారు. డాక్టర్ ఉదయ్, డి. సంజీవ కుమార్ పాల్గొన్నారు.

ఏకదంతం.. విభిన్న రూపం

- కొలువైన గణనాథులు
- ఆకట్టుకుంటున్న గణపతి విగ్రహాలు
- వాడవాడలా వెలసిన చవితి పందిళ్లు



వెంకటేశ్వరమెట్ట వినాయకుడిని దర్శించుకుంటున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు



నేరెళ్లకోనేరులో రైజింగ్ గైస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం



సిద్ధి వినాయకుడిని దర్శించుకుంటున్న కోలా గురువులు, పచ్చిరిపల్లి రాము



దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన బంగారు గణపతి

అల్లిపురం: వినాయక చవితి సందర్భంగా మండపాలలో గణనాథులు కొలువయ్యారు. వివిధ రూపాలలో కొలువదీరిన గణపయ్యలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. నియోజకవర్గంలో 32, 33, 34 వార్డుల్లోని వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు. నేరెళ్ల కోనేరులో గల గణపతి ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల సిద్ధి వినాయక ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా చేపడుతున్నారు. స్వామివారిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాముతో కలిసి దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు ఇక్కడి గణనాథులను దర్శించుకున్నారు. వెంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు..

డాబాగార్డెన్స్: నియోజకవర్గం పరిధిలో జగదాంబ జంక్షన్, యల్లమ్మతోట, సూర్యాబాగ్, మహారాణిపేట, అంగటిదిబ్బ, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, చాకలిపేట, సాలిపేట, అల్లిపురం, రెల్లివీధి, కోటవీధి, పాతనగరం, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, పూర్ణామార్కెట్, రామజోగిపేట తదితర ప్రాంతాల్లో నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

దిబ్బలపాలెంలో..


జీవీఎంసీ 29వ వార్డు పరిధి దిబ్బలపాలెంలో యూత్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన బంగారు గణపతి భక్తులను ఆకట్టుకుంటోంది. 11 అడుగుల పొడవుతో ఏర్పాటు చేసిన స్వర్ణ గణపతి విద్యుత్ వెలుగుల్లో పలువుర్ని ఆకర్షిస్తోంది. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు, 18న రాత్రి మహాన్నదానం, 19న దీపారాధన, 20న కుంకుమ పూజలు, 21న స్వామి లడ్డూ వేలం, నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉరికిటి గిరీష్, తాడి శ్రీధర్, చందక ప్రవీణ్, పి. శ్రీనివాసరాజు, కట్టా యశ్వంత్, బందారు లోకేష్‌కుమార్, చిటికిరెడ్డి పవన్‌కుమార్, చందక ప్రభాకర్, అజయకుమార్, అరవింద్‌కుమార్ (మణి), పడాల సూర్యకుమార్, నార్గాన కల్యాణ్, మణి, పసగాడ రామలింగేశ్వరరావు, కడిమి అనిల్‌కుమార్, పెద్ద ఎత్తున మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

చింతామణి గణపతి దేవాలయంలో..

స్థానిక సుబ్బలక్ష్మీనగర్‌లో గల చింతామణి గణపతి దేవాలయంలో 25వ వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అధ్యక్షుడు సీవీఎస్ఎల్ రాజు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, ఎం. శ్రీను, యుగంధర్, నానాజీ, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికలు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు.



చింతామణి గణపతి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో గణనాథుడు



ఏవీఎన్ కాలేజీ రోడ్డులో అర్ధనారీశ్వరుడిగా అలరిస్తున్న గణనాథుడు

ముగిసిన పోషకాహార వారోత్సవాలు



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి



పిల్లలకు పౌష్టికాహారం తినిపిస్తున్న డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట: వారం రోజుల నుంచి జరుగుతున్న పోషకాహార వారోత్సవాలు శనివారం కేజీహెచ్ పిల్లల వైద్య విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిశాయి. దేశంలో ప్రతి గర్భిణి, తల్లి, పిల్లలకు సరైన పోషకాహారం అందించడం, అలాగే సమగ్ర ఆరోగ్యం కోసం పోషకాహారంపై అవగాహన పెంపొందించడం, శారీరక, మానసిక ఆరోగ్యానికి పోషకాహారం పునాది అని అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పిల్లల వైద్య విభాగానికి చెందిన డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులు, పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అలాగే పలు పాఠశాలల్లో కూడా పోషకాహారం విలువలు, వండే విధానం గురించి తెలియజేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ పోషకాహార కార్యక్రమం ద్వారా తల్లులు, పిల్లలకు తగిన పోషక విలువలు అందుతున్నాయని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కేజీహెచ్ పేరు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిల్లల విభాగం వైద్యులు డాక్టర్ సత్యకుమారి, డాక్టర్ హేమారెడ్డి, డాక్టర్ ప్రభు, డైట్ కౌన్సిలర్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం



లాసన్స్ బే వద్ద ఫుట్‌పాత్‌పై మతి స్థిమితం లేని వ్యక్తి



మతిస్థిమితం లేని వ్యక్తిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో చేర్పిస్తున్న ఎంవీపీ పోలీసులు

అల్లిపురం : మతి స్థితిమం లేని వ్యక్తికి ఎంవీపీ పోలీసులు ఆశ్రయం కల్పించారు. శనివారం రాత్రి వినాయక చవితి సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ నగరంలో వినాయక మండపాలు, నిమజ్జన ప్రాంతాలను పర్యవేక్షించే నిమిత్తం నగరంలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో లాసన్స్‌బే కాలనీ బీచ్‌రోడ్డు వద్ద రాత్రి ఒంటి మీద దుస్తులు లేకుండా వర్షంలో తడుస్తున్న నడి వయసు వ్యక్తిని గమనించారు. తక్షణమే ఆయన ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు ఫోన్ చేసి ఆ వ్యక్తికి తిండి, నీళ్లు, బట్టలు అందించి ఆశ్రయం కల్పించాలని ఆదేశించారు. ఫోటో తీసి పంపించాలని సూచించారు. దీంతో ఎంవీపీ పోలీసులు మతిస్థిమితం లేని వ్యక్తి వద్దకు చేరుకున్నారు. అతనికి తాగునీరు, దుస్తులు, ఆహారం అందించారు. అతన్ని పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన ఆశ్రమంలో చేర్పించారు.

చైతన్య స్రవంతి సేవలు ప్రశంసనీయం



విద్యార్థినికి క్యాన్సర్ వ్యాక్సిన్ బూస్టర్ దోస్ వేస్తున్న డాక్టర్ షిరీన్ రెహమాన్

మహారాణిపేట: మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నియంత్రణకు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఏవీఎన్ కాలేజీ ఎదురు 37వ వార్డు సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆదివారం నిర్వహించిన క్యాన్సర్ వ్యాక్సిన్ బూస్టర్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. క్యాన్సర్ నివారణకు చైతన్య స్రవంతి ముందుకు రావడం ముదావహమని అన్నారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్‌ను సత్కరించారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ మహిళల్లో హెచ్పీ వైరస్‌ను నియంత్రించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 16న మొదటి డోస్ వేశామని ఆదివారం బూస్టర్ డోస్ వేశామని చెప్పారు. కేజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 4న క్యాన్సర్ డే సందర్భంగా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నియంత్రణ హెచ్పీవీ నిరోధక వ్యాక్సిన్ వేసేందుకు డాక్టర్ షిరీన్ రెహమాన్ ముందుకొచ్చారని అన్నారు. 45 మంది బాలికలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏరియా బిజినెస్ మేనేజర్ బి రాం రతన్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రుకియా భాను, విజయకుమారి, అనసూయ, రోజా, సీహెచ్ లక్ష్మి, దేవి, తెలుగు మహిళా నాయకురాలు కేదార లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ ఫౌండర్స్ డే



మాట్లాడుతున్న గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ చర్చి పాస్టర్ గరికిముక్కుల పాల్ విక్టర్

తాటిచెట్లపాలెం : తాటిచెట్లపాలెం, కైలాసపురం ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ ఫౌండర్స్ డే వేడుకలు గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫౌండర్ గరికిముక్కల సరోజిని రాబర్ట్స్ 89వ జయంతిని నిర్వహించారు. గరికిముక్కుల పాల్ విక్టర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో యనమల ఐజక్ దైవ సందేశం అందించారు. చర్చి పాస్టర్ పాల్ విక్టర్ మాట్లాడుతూ 55 ఏళ్ల క్రితం ఈ పరిచర్యలు ప్రారంభించి, పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పేద మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, ఉచితంగా మిషన్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిషప్‌లు పద్మకుమార్, జార్జ్‌బాబు, జాన్‌మేరీ, పాల్, రవిబాబు, జాన్ విక్టర్, చర్చి పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన..

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- బిక్కుబిక్కుమంటున్న పాతనగర వాసులు
- వినాయక మండపాలకు వర్షం తాకిడి



పాతనగరంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లు



వర్షానికి తడిసి ముద్దవుతున్న ఫిషింగ్ హార్బర్‌లోని వినాయక మండపం

డాబాగార్డెన్స్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం అర్ధరాత్రి వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి నియోజకవర్గంలో గల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పాతనగరంలో శిథిలావస్థలో పలు భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పాతనగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పెద్ద కాల్వల ద్వారా చెత్తాచెదారం రోడ్లపైకి చేరుకుంది. చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇదిలా ఉండగా కాన్వెంట్ జంక్షన్ వద్ద గల చావుల మదుం కింద వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వినాయక మండపాలకు వర్షం తాకిడి..

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వినాయక మండపాలు తడిచి ముద్దవుతున్నాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పందిళ్లకు పెద్ద తార్పన్లు వేసినప్పటికీ జోరువాన ధాటికి అవి కాయకపోవడంతో పలు వినాయక మండపాల్లోకి వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లో అయితే ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది.

బిక్కుబిక్కుమంటున్న పాతనగరం వాసులు..

ఇదిలా ఉండగా పాతనగరంలో వందేళ్లకు పైబడొశిథిలావస్థలో ఉన్న పలు ఇళ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం, పోలీసులు నిరంతర పర్యవేక్షణలో ఉన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయాందోళనలో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు.

సీబీఎం కాంపౌండ్‌లో కూలిన గోడ..

సీతమ్మధార: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 27వ వార్డులోని ఆశీలమెట్ట, నెహ్రూబజారు, దొండపర్తి, సీబీఎం కాంపౌండ్ ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షాలకు సీబీఎం కాంపౌండ్‌లోని అపార్టుమెంట్ భారీ గోడ కూలిపోయింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

చావులమదుం వంతెన కింద భారీగా చేరిన వరద నీరు..

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో గల చావుల మదుం వంతెన కూడలిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వంతెన వద్ద వర్షపు నీరు చేరింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కంచరపాలెం మీదుగా జ్ఞానాపురం, అటు నగరం నుంచి పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. సాయంత్రానికి వర్షం తగ్గుముఖం భారీ వాహనాలు రాకపోకలు సాగించాయి. జ్ఞానాపురం ఎర్రిగెడ్డ ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పర్యవేక్షణలో జెసీబీలతో పూడికల తొలగింపు చర్యలు చేపట్టారు.



చావులమదుం వైపు వెళ్లొద్దంటూ స్టాపర్లు ఏర్పాటు చేసిన పోలీసులు



సీబీఎం కాంపౌండ్‌లో కూలిన గోడ



ఎర్రిగెడ్డలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం



కాన్వెంట్ జంక్షన్ వద్ద గల వంతెన దిగువ చేరిన వర్షం నీరు

జలమయం



నీట మునిగిన వన్‌టౌన్ ప్రధాన రహదారి



చెరువులా మారిన స్టేడియం రోడ్డు



దుర్గాలమ్మ గుడి జంక్షన్‌కు వర్షం దెబ్బ



నీట మునిగిన వెలంపేట పోస్టాఫీసు ప్రాంతం

జగదాంబ: శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పాతనగరంలోని పలు రహదారులు జలమయం అయ్యాయి. చిన్నపాటి వర్షం కురిస్తే నీళ్లతో నిండిపోళ్లే ప్రాంతం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి అనేక చోట్ల నీట మునిగింది. హార్బర్ స్టేషన్ రహదారి, రామకృష్ణా జంక్షన్, 75 ఫీట్ రోడ్డు, జనతా బజార్ రహదారి, బౌడారా రోడ్డు, పూర్ణామార్కెట్, వెలంపేట ప్రాంతాల రహదారులు మోకాలి లోతు నీటితో నిండిపోయాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో వాహనాలు నీటిలోనే ఉండిపోయాయి. ఆగని వర్షం వల్ల జనజీవనం స్తంభించిపోయింది. ఎటు చూసినా రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. చిరు వ్యాపారులు సైతం ఇంటికే పరిమితం అయ్యారు. ఆదివారం అయినప్పటికీ జీవీఎంసీ సిబ్బంది విధులు నిర్వహించారు. రోడ్లపై నిలిచిపోయిన నీళ్లు కాలువల ద్వారా ప్రవహించే విధంగా చర్యలు తీసుకున్నారు. 75 ఫీట్ రోడ్డులోని యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగి చెరువులను తలపించాయి.

కాట్రగడ్డ భారతికి సురా పురస్కారం



భారతికి పురస్కారం ప్రదానం చేస్తున్న కరుణరాజు తదితరులు

సీతంపేట : ప్రముఖ సంఘ సేవకుడు, హేతువాది పేరిచర్ల సుబ్బరాజు పేరిట నెలకొల్పిన సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారాల ప్రదానం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. సావిత్రీ భాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు అందజేశారు. సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారం 2024 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతికి స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు చేతుల మీదుగా అందజేశారు. అలాగే చరిత్రకారుడు సయ్యద్ నజీర్ అహ్మద్‌కు(2019), ప్రజా వాగ్గేయకారుడు డప్పు రమేష్‌కు(2020), ప్రముఖ సాహిత్య సామాజికవేత్త అనిశెట్టి రజితకు(2021), ప్రముఖ సంఘ సేవకురాలు పి.రాజ్యలక్ష్మికి(2022), ప్రముఖ రక్తదాన ఉద్యమకారుడు వి.వినోద్‌బాలుకు (2023) పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ కుల, మత, సామాజిక రుగ్మతలకు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన మానవతావాది పేరిచర్ల సుబ్బరాజు అని కొనియాడారు. వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారిని అతని పేరిట పురస్కారంతో కుటుంబ సభ్యులు సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్.బాబూరావు పాల్గొన్నారు.

తిరుమలేశునికి సహస్ర నామార్చన

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో కొలువైన తిరుమలేశునికి శనివారం సహస్రనామార్చన ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే స్వామికి సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత వెంకన్నను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.